RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 229 | ఆగస్టు 08, 2025 | వెల : రూ.3-00



దాసరి మార్కండేయకు ఉత్తమ చేనేత కార్మిక అవార్డు

2లో..




# చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలి

– కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సదుపాయాలను వినియోగించుకొని చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత శాఖ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ కొత్తవాడ ఇందిరా గాంధీ విగ్రహం నుండి కెమిస్ట్ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. అనంతరం కెమిస్ట్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వృత్తి జీవనోపాధి కాదు, భారత సంస్కృతిని ప్రతిభింభించే ప్రతీక అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తూ దేశంలోని మొత్తం వస్త్ర ఉత్పత్తిలో 19శాతం భాగస్వామ్యం కలిగియున్నదన్నారు. ప్రపంచం అన్ని రంగాల్లో వేగంగా మారుతున్న నేపథ్యంలో చేనేత రంగం కూడా సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడే వారని, నేడు ఆన్‌లైన్ మార్కెట్లు, డిజిటల్ పోర్టల్స్ ప్రభుత్వ వేదికలు వంటి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్పులను అంగీకరించి, తరం నుండి తరం వరకు నైపుణ్యాన్ని కొనసాగించడమే కాకుండా, ఆదాయాన్ని పెంపొందించే దిశగా చేనేత కుటుంబాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత వృత్తులు కనుమరుగు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత చేనేత కార్మికులపై ఉందన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా మన ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేలా డిజైన్‌తో వస్తువు తయారు చేసి ఇతర రాష్ట్రాల దేశ ప్రముఖులు సందర్శించినప్పుడు బహూకరించవచ్చన్నారు. ఇప్పటికే వరంగల్ జిల్లా ఉత్పత్తులు జిఐ ట్యాగ్ పొందాయని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. వినూత్నమైన డిజైన్స్ తో ఉత్పత్తులను నేస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇటీవల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్ దర్రితో కూడిన జ్ఞాపకాలను అందించడం జరిగిందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్లో చేనేత ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేసి చేనేత ఉత్పత్తులు విక్రయించేలా ప్రోత్సహించడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో 2300 మంది నేత కార్మికులు ఉన్నారని, చేనేత రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. చేనేత కార్మికులను ఘనంగా సన్మానించి, చేనేత పై నిర్వహించిన పకృత్వ ఉపన్యాస పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బసవరాజు కుమార్, జెడ్పిసిఈఓ రామిరెడ్డి, జిల్లా చేనేత జౌళి అధికారి శ్రీకాంత్ రెడ్డి, చేనేత సంఘాల నేతలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు ఉన్న వాళ్ళకే ఇందిరమ్మ ఇళ్లా..?



**వేద న్యూస్,ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండలం గోదురు గ్రామంలో ఇల్లు ఉన్న వాళ్లకే ఇల్లు ఇచ్చారంటూ గోదురు గ్రామ వాసి గోపు లలిత అనే మహిళ మండల డెవలప్మెంట్ ఆఫీసర్ కు పిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే గోదురు గ్రామంలో రాచకొండ సునీత అను వ్యక్తికి ఇంటి నెంబర్ 6-18 నెంబరు గల ఇల్లు ఇప్పటికే ఉందని వారు అందులోనే నివాసం ఉంటున్నారనీ అని మండల డెవలప్మెంట్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం కేటాయించిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కోటలోని ఇందిరమ్మ ఇండ్లను ఒక బిఆర్ఎస్ నాయకుడు వారికి దగ్గరి బంధువు అని ఇల్లు ఉన్న వారికి ఇచ్చుకున్నారు అని సదరు పిర్యాదు దారు వాపోతున్నారు. గోదురు గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలు, కిరాయికి నివాసం ఉంటున్నవారు చాలామంది ఉన్నారని ఇప్పటికే ఇల్లు ఉన్న రాచకొండ సునీతకు కేటాయించిన ఇందిరమ్మ ఇల్లును రద్దు చేసి ఇల్లు లేని వారికి ఇవ్వాల్సిందిగా గోపు లలిత అధికారులను కోరడమైనది.

# కొత్త కోర్సుల గురించి అధ్యాపకులకు అవగాహన కీలకం

– ఉస్మానియా ప్రొఫెసర్ పాట్రిక్స్



**వేద న్యూస్, హైదరాబాద్:**

మార్కెట్ డిమాండ్ ఉన్న కోర్సులకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నప్పుడు, అధ్యాపకులకు వాటిపై సమగ్రమైన అవగాహన ఉండాలని అన్నారు ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ ప్యాట్రిక్స్. సిటీ కాలేజీలో ఎఇడిపి కోర్సులపై అధ్యాపకులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో ఎఇడిపి కోర్సుల అమలులో గవర్నమెంట్ సిటీ కాలేజ్ తీసుకుంటున్న ముందడుగు అభినందనీయమని అన్నారు. కళాశాలలు అందిస్తున్న కోర్సులకు, పరిశ్రమలలో నిర్వహించబోయే బాధ్యతలకు మధ్య ఉండే అవకాశాలను, సవాళ్ళను గురించి చర్చించడానికి పరిష్కారాలను ఆలోచించడానికి ఇలాంటి వేదికలు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఎఫ్ డిపిలో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్, దక్షిణ విభాగానికి చెందిన రాజమణి రాజు జాతీయ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ పథకం గురించి సమగ్ర అవగాహన కల్పించారు. కళాశాల గ్రంథాలయ పాలకులు

డా.సిహెచ్.రవి కుమార్ ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ తో ప్రభావవంతంగా తరగతుల నిర్వహణ గురించి వివరించారు. ఉచితంగా లభించే డిజిటల్ లెర్నింగ్ సాధనాలు విద్యాబోధనలో ఎలా ఉపయోగించాలో చూపించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కు చెందిన ప్రొఫెసర్ వై. రామకృష్ణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భవిష్యత్తు వృత్తి నైపుణ్యాలు అనే అంశంపై ఆసక్తికరమైన విషయాలను అందించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శాంతి మాట్లాడుతూ మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న కోర్సులు, బోధనా పద్ధతుల గురించి అధ్యాపకులు నిరంతరం అప్డేట్ కావలసిన అవసరముందని అన్నారు. ఈ దిశలో కామర్స్ విభాగం చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. డా.ఎస్.ఝాన్సీ రాణి సమన్వయం చేసిన సమావేశంలో కన్వీనర్ డా.మల్లికార్జున్ నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఫత్ ఉన్నీసా, లలిత చైతన్య, డా.రవీంద్ర, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

# సీఎం హామీని నిలబెట్టుకోవాలి

– వీ హెచ్ పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వికలాంగుల పెన్షన్ రూ. 4 వేల నుండి రూ.6 వేల కు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ రూ.2016 నుండి రూ.4 వేలకు కండరాల క్షీనత రోగులకు, ఇతర తీవ్రమైన రోగులకు రూ. 15 వేలు కి ఆంధ్రప్రదేశ్ లో లాగా పెంచి, తెలంగాణ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ని నిలబెట్టుకోవాలని విహెచ్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు.గురువారం వృద్ధులు, వితంతువుల పెన్షన్ దారుల సన్నాహక మహాసభ హసన్ పర్తి మండలంలోని ఎం టి ఆర్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా..

వీ హెచ్ పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు గా విహెచ్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దూడల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారు మాట్లాడుతూ..అందాల పోటీలకు, భూస్వాములకు రైతు భరోసాకు, అభివృద్ధి పేరుతో వేల కోట్ల ఖర్చు పెడుతున్నప్పుడు, కాళ్ళు, కళ్ళు, మాట్లాడలేని వికలాంగులకు, వయసు మీద పడిన వృద్ధులకు, భర్త లేకుండా బిడ్డలను పోషించే శక్తీ లేని వితంతువులకు, తీవ్రమైన రోగాలతో చావుతో సావాసం చేస్తున్న కండరాల, రక్త హీనత ఇతర రోగులకు ఎందుకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని పెన్షన్ పెంచకుండ అన్యాయం చేస్తున్నారో..ఆ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు తెలుసుకొని ఆగష్టు మొదటి వారం లోపు 15డిమాండ్స్ తీర్చకపోతే రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఆగష్టు 13న హైదరాబాద్, LB స్టేడియంలో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభ తో కుప్ప కూల్చుతామని హెచ్చరించారు. ఈనెల 13న చలో హైదరాబాద్ ప్రోగ్రాం నిర్వహించ నున్నట్టు తెలిపారు. ఈ పేద వర్గాల పెన్షన్ ను పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీల మౌనం వీడాలని గుర్తు చేశారు.

కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ఎం ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు వైకె విశ్వనాధ్ మాదిగ , హనుమకొండ జిల్లా ఇంచార్జ్ కందుకూరి సోమన్న మాదిగ ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ ,ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ ,ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు ఆరేపల్లి పవన్ మాదిగ , ఎమ్మెస్ పి జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు బిక్షపతి మాదిగ, జిల్లాలోని వికలాంగులు వృత్తులు వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# అందరి లెక్కలు సరి చేస్తాం

– ఐఏఎస్, ఐపీఎస్‌లకు కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

**వేద న్యూస్, డెస్క్:**

రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరో రెండేండ్లలో మళ్లీ

మిగతా 4వ పేజీలో..

# దేశంలో మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ



## చేనేత కార్మికులకు
# ఫ్రూట్స్ పంపిణీ

**– జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో..**



**వేద న్యూస్, జమ్మికుంట:**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం అర్థ శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంట అధ్యాపకులు, విద్యార్థులు, ఇన్ చార్జి ప్రిన్సిపాల్.. పట్టణంలోని బాలాజి చేనేత సహకార సంఘం కార్మికులకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఓ. కుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో చేనేత రంగం పోషించిన పాత్రను కొనియాడారు. అర్థ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ కే. రాజేంద్రం మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. అనంతరం.. విద్యార్థులు, అధ్యాపకులు 40 మంది చేనేత కార్మికులకు ఫ్రూట్స్ పంపిణీ చేసి.. జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.




## దాసరి మార్కండేయకు ఉత్తమ చేనేత కార్మిక అవార్డు

**వేద న్యూస్, హన్మకొండ :**

హన్మకొండ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స హాల్ లో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన దాసరి మార్కండేయకు హన్మకొండ జిల్లా ఉత్తమ సీనియర్ చేనేత కార్మిక అవార్డును చేనేత జౌళి సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాసరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



ఇంటింటి ప్రచారంలో బిజెపి నేతలు

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తాచాటుతామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. గురువారం దా మె ర గ్రామంలో గడపగడపకి వెళ్లి కేంద్ర సంక్షేమ పథకాల గురించి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో.. సుధాకర్ దొర ఇంటి వద్ద నుండి కోమ్మిడి మోహన్ రెడ్డి కొట్టం వద్ద వరకు.., అలాగే నాగరాజు ఇంటి నుండి నరిగె రాజు ఇంటి వద్ద వరకు కూడా సిసి రోడ్ నిర్మాణం చేసినట్టు వివరించారు. అలాగే ఐదో వార్డులో నీటి కొరత ఏర్పడగా, బండి సంజయ్ చొరవతో.. వెంటనే అంబిరి రాములు ఇంటి వద్ద బోర్వెల్ వేయించినట్టు వెల్లడించారు. ఇలా మరెన్నో పనులు గ్రామ అభివృద్ధి కోసం ఎల్కతుర్తి బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు.. బిజెపి బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు.

## రవీందర్ సింగ్ మృతి పార్టీకి తీరని లోటు



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్ సింగ్ అనారోగ్య కారణం వల్ల మృతి చెందారు. విషయం తెలిసి వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి, వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఘన నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేసిన వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి. వారి వెంట రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహ రాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, సీనియర్ నాయకులు కూనమళ్ల పృథ్వీరాజ్, వనపర్తి మల్లయ్య, శీలం సత్యనారాయణ, పొదిళ్ల రామచందర్, రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, యువ మోర్చా నాయకులు జూలూరి మనీష్ గౌడ్, కుంభం కోమల్ రెడ్డి, , బానోత్ రమేష్, పట్టణ కమిటీ సభ్యులు కందికొండ శ్రీనివాస్, సూత్రపు సరిత, కాసుల నాగేంద్రబాబు, వరంగంటి రాజకుమార్, తప్పేట్ల సతీష్, చిలువేరు అన్వేష్ తదితరులు ఉన్నారు.

## ఉద్యమకారుల మహా
# పాదయాత్రని జయప్రదం చేయండి



**వేద న్యూస్, శాయంపేట:**

తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ తీరుపై తీవ్ర అసంతృప్తి కారణంగా ఈనెల 11 తేదీన న మహా పాదయాత్ర చేస్తున్నట్లు ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్ పిలుపునిచ్చారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలము , నెలకు రూ. 2,500 పెన్షన్ అందజేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించడమే కాకుండా, తెలంగాణ ఉద్యమకారుల యోగక్షేమాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఉద్యమకరూలలో తీవ్రమైన అసంతృప్తి వలన ఈ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయడం కోసం తెలంగాణ ఉద్యమకరూల ఫోరం ఆధ్వర్యంలో ఇప్పటికే పలు మార్లు మెమొరాండాలు సమర్పించడం, ప్రతి జిల్లాలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం,అయినా ప్రభుత్వం నుంచి తగిన స్పందన లేకపోవడంతో, ఉద్యమకరూలు మరింత బలంగా తమ హక్కుల కోసం పోరాడే నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన మహా పాదయాత్ర నిర్వహిస్తామని వారు పిలుపును ఇచ్చారు. ఈ పాదయాత్ర హన్మకొండ వేయి స్తంభాల గుడి నుండి ఏకశిలా పార్క్ వరకు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ పాదయాత్రలో తెలంగాణ ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని గళాన్ని, మన నినాదాన్ని ప్రభుత్వం వరకు తీసుకెళ్లాలని, మన హక్కుల కోసం సమైక్యంగా నిలవాలని తెలంగాణ ఉద్యమకుల ఫోరం పిలుపునిచ్చారు.

## చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తా

**- చేనేత కార్మికులను ఆదుకుంటాం - జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే**

**వేద న్యూస్,శాయంపేట:**

చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో శాయంపేటలో చేనేతను అభివృద్ధి పథంలో తీసుకుపోతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం లో ఏర్పాటు చేసిన చేనేత కార్మికుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ హాజరైనారు. చేనేత రంగంలో రాణిస్తూ చేనేతకు గుర్తింపు తీసుకొస్తున్న జిల్లాలోని పలు మండలాలకు చెందిన చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటానని, శాయంపేట మండల కేంద్రంలో పద్మశాలి కులస్తుల కోసం కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తానని, చేనేత పించన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటానని, మీరంతా ఐక్యతగా ఉంటూ పద్మశాల అభివృద్ధికి పాటుపడాలని సంఘాల పేరిట కులవృద్ధికి అడ్డు నిలవద్దని సూచన చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ బొద్దున వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రాంత అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు దిడ్డి రమేష్, కేదాస్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ప్రశాంత్,జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులి కంటి రాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ



వేణుగోపాల్,జిల్లా కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్,చేనేత సహకార సంఘం అధ్యక్షులు మామిడి శంకర్ లింగం, మండల అధ్యక్షులు వంగరి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి సామల ధనుంజయ్,మహిళా అధ్యక్షురాలు బాసని శాంత, కేదాసి రాకేష్, గ్రామ శాఖ అధ్యక్షులు బాసని ప్రకాష్, పద్మశాలి కులస్తులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్లో ఘనంగా
# తల్లిపాల వారోత్సవాలు



**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి:**

మెట్ పల్లి మండలం బండలింగాపూర్ లోని అంగన్వాడి సెంటర్ 2 లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా అంగన్వాడీ టీచర్ భాగ్య మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలు పిల్లలకు రోగానిరోధక శక్తిని పెంచుతుందని వారు పేర్కొన్నారు. కాబట్టి పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పిల్లలకు పట్టించాలని అన్నారు. గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించేందుకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం,అన్నప్రాసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ లత, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా కప్ సెలెక్టర్లకు సవాల్‌గా జట్టు ఎంపిక..!

**వేదన్యూస్ డెస్క్:**

భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన ముగిసింది. ప్లేయర్స్ అంతా స్వదేశానికి తిరిగి వస్తున్నారు. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోన టీమిండియా అద్భుతంగా రాణించింది. ఇకపై భారత జట్టు ఆసియా కప్‌కు సన్నద్ధం కానున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలు కానున్నది. ఈ సారి ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో జరుగనున్నది. ఆసియా కప్ జట్టును ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి పెద్ద సవాల్‌గా మారింది. టీ20 జట్టు ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల మూడోవారం వరకు ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటిస్తుందని భావిస్తున్నారు. జట్టులో చోటు కోసం యశస్వి జైస్వాల్, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ పోటీలో ఉన్నారు. సెప్టెంబర్ 28న జరిగే టీ20 టోర్నీలోని ఫైనల్‌కు భారత్ అర్హత సాధిస్తే.. కొద్దిరోజులకే వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో భారత్ వెస్టిండీస్ మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఐపీఎల్ చివరి సీజన్‌లో యశస్వి మంచి ఫామ్‌లో కనిపించాయి. 160 స్ట్రయిక్ రేట్‌తో 559 పరుగులు చేశాడు. గిల్ 15 మ్యాచుల్లో 155 కంటే ఎక్కువ స్ట్రయిక్ రేట్‌తో 650 పరుగులు చేరశాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుతో శుభ్‌మన్ గిల్‌తో ఓపెనింగ్‌కు దిగే సాయి సుదర్శన్ సైతం 156 స్ట్రయిక్ రేట్‌తో 759 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్‌ను దక్కించుకున్నాడు.




ఈ ముగ్గురికి టీ20 జట్టులో చోటు కల్పిస్తారా? లేదా ఉన్నది చూడాల్సిందే. ఆసియా కప్‌లో ఆడే ప్లేయర్స్ అంతా ఫైనల్ వరకు 21 రోజులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఆసియా కప్ కోసం 17 మంది సభ్యులతో జట్టును ఎంపిక చేయనుండగా.. ప్రస్తుతం ఉన్న ఆప్షన్స్‌ను సెలెక్టర్లు జాగ్రత్తగా పరిశీలించన్నట్లు బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. ఆసియా కప్ యూఏసీలో ఆసియా కప్ జరుగనున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌ని బట్టి చూస్తే యశస్వి, గిల్, సాయి సుదర్శన్ టాప్ ఆర్డర్‌లో కీలక ఆటగాళ్లు అయ్యే అవకాశం ఉంది. సాయి సుదర్శన్ టీ20ల్లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అయితే, టీమిండియాకు బౌలింగ్ విభాగంలో ఇబ్బందికరంగా మారింది. కీలక టోర్నీకి ఫాస్ట్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఆసియా కప్ తర్వాత వెంటనే వెస్టిండిస్‌తో సిరీస్ నేపథ్యంలో వీరి విషయంలో సెలెక్టర్లు జాగ్రత్తలు తీసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు ఫిట్‌నెస్‌ను సైతం అంచనా వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు ఫిట్‌నెస్‌ను సైతం అంచనా వేయాలని సమాచారం.

# ఐసీసీ ర్యాంకింగ్స్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో సిరాజ్‌కు అత్యుత్తమ ర్యాంకు..!



**వేదన్యూస్ డెస్క్:**

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. ఓవల్‌లో జరిగిన చివరి ఓవల్ టెస్ట్‌లో సిరాజ్ కారణంగానే టీమిండియా ఆరు పరుగుల తేడాతో గెలవగలిగింది. దాంతో భారత్ సిరీస్‌ను 2–2 సమం చేయగలిగింది. ఐదో టెస్ట్ మ్యాచ్ చివరి రోజున మ్యాచ్, సిరీస్‌ను గెలవడానికి ఇంగ్లాండ్‌కు 35 పరుగులు అవసరం కాగా.. సిరీస్‌ను సమం చేయడానికి భారత్‌కు నాలుగు వికెట్లు అవసరం. ఐదోరోజు సిరాజ్ మూడు వికెట్లు కూల్చి భారత్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. సిరాజ్ 12 ర్యాంకులు మెరుగుపరుచుకొని 15వ స్థానానికి చేరుకున్నాడు. హైదరాబాదీ బౌలర్‌కు ఇదే కెరియర్‌లో అత్యుత్తమ ర్యాంకు. ఇంతకు ముందు ఈ ఏడాది జనవరిలో 16వ ర్యాంక్ వరకు చేరాడు. వర్క్ మేనేజ్‌మెంట్ నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో మూడు మ్యాచులు ఆడిన జస్ప్రీత్ బుమ్రా 889 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ సైతం అత్యుత్తమంగా 59వ ర్యాంక్‌కు చేరుకుదున్నారు. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఓవల్ టెస్ట్‌లో సెంచరీ సాధించి తిరిగి టాప్–5లో చోటు దక్కించుకున్నాడు.

# ప్రేమలో మృణాల్ ఠాకూర్..?





**వేదన్యూస్ డెస్క్:**

దక్షిణాది అగ్రనటుడు ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉందనే వార్తలు ప్రస్తుతం ముంబయి సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వీరిద్దరి డేటింగ్‌పై ఆంగ్ల మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ జంట ప్రేమబంధానికి కొద్ది మాసాల క్రితమే బీజం పడిందని అంటున్నారు. ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ధనుష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని నెలల క్రితం చెన్నైలో జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ మధ్య తొలిసారి పరిచయం ఏర్పడిందని, అక్కడే వీరి ప్రేమప్రయాణానికి తొలి అడుగులు పడ్డాయని అంటున్నారు. ధనుష్ సోదరీమణులు కార్తీక, విమల గీత ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఠాకూర్‌ను ఫాలో కావడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. ధనుష్ తన కుటుంబ సభ్యులకు మృణాల్ ఠాకూర్‌ను పరిచయం చేశారని అంగ్ల మీడియాలో వార్తలొచ్చాయి. తమ ప్రేమబంధంపై ప్రస్తుతం ఈ జంట గోప్యతను పాటిస్తున్నారని, సరైన సమయంలో అందరికి తెలియపరిచే ఆలోచనలో ఉన్నారని సమాచారం.గత కొద్దిరోజులుగా మీడియాలో వస్తున్న డేటింగ్ వార్తలపై ఈ తారలిద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. దాంతో డేటింగ్ రూమర్స్ నిజమేనని అభిమానులు భావిస్తున్నారు.




# అభిమానుల ప్రేమే రక్షాకవచం

**వేదన్యూస్ డెస్క్:**

79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఫీనిక్స్ ఫాండేషన్, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మెగాబ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో అగ్ర నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువ హీరో తేజ సజ్జా, కథానాయిక సంయుక్తమీనన్ అతిథులుగా హాజరయ్యారు. బుధవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో 800 మంది వరకు పాల్గొన్నారని, సేకరించిన రక్తాన్ని భారత సైన్యానికి విరాళంగా అందించబోతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'రక్తదానం అనగానే నా పేరు గుర్తుకురావడం పూర్వజన్మ పుణ్యఫలంగా భావిస్తున్నా. సోషల్‌మీడియాలో వచ్చే విమర్శలపై మీరెందుకు స్పందించరని చాలా మంది అడుగుతుంటారు. అలాంటి అనవసర విషయాలపై నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, నాపై అభిమానులు చూపించే ప్రేమే నాకు రక్షణ కవచాలుగా భావిస్తాను. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. రక్తదానం వంటి మంచి కార్యక్రమాలు ఎవరు చేసినా నన్ను పిలిస్తే తప్పకుండా వచ్చి మద్దతునిస్తాను' అన్నారు.

# జ్యోతికని మించిన అందం..!

**వేదన్యూస్ డెస్క్:**



తమిళ నటుడు సూర్యకి తమిళంలోనే కాక తెలుగులోను ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆయన సినిమాలతోనే కాకుండా సేవా కార్యక్రమాలతో అందరి మనసులు గెలుగుచుకున్నాడు. సూర్య స్థాపించిన 'అగరం ఫౌండేషన్'కు 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా చెన్నైలో ఇటీవల ఘనంగా వేడుక నిర్వహించారు. ఈ వేడుకకి ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ప్రముఖులు వెట్రి మారన్, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ వేడుకలో సూర్య–జ్యోతిక దంపతులు , వారి పిల్లలు దియా, దేవ్ , అలాగే సూర్య సోదరుడు కార్తీ కుటుంబంతో పాల్గొన్నారు. అగరం ఫౌండేషన్ 15 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, ఇప్పటి వరకు అందించిన సేవలను అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సూర్య కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సూర్య, జ్యోతిక, వారి పిల్లలు దియా, దేవ్‌లతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. ఆలయం వెలుపల సూర్యను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, భక్తులు గుమిగూడారు. ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి ఉత్సాహం చూపించారు. ఆ సందర్భంలో తీసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో సూర్య కూతురు దియా సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. నెటిజన్లు ఆమె లుక్స్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. తల్లిన మించిన అందం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు జ్యోతిక గ్లామర్ కూడా ఏ మాత్రం తగ్గలేదని అంటున్నారు. ప్రస్తుతం వారి పిక్స్ సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. కాగా, సూర్య స్థాపించిన అగరం ఫౌండేషన్ అనే సాంఘిక సేవా సంస్థ 15 సంవత్సరాల క్రితం ప్రారంభం కాగా, ఈ సంస్థ ప్రధానంగా తమిళనాడులోని నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ ఫౌండేషన్ చేపట్టిన 'విధ్యా ప్రాజెక్ట్' ద్వారా ఇప్పటి వరకు 6700 మందికి పైగా గ్రాడ్యుయేట్లను సమాజానికి అందించారు. అనేక మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన అగరం ఫౌండేషన్ సేవలు అభినందనీయమైనవి.



# మంచు మనోజ్ కొత్త సినిమా.. పోస్టర్ విడుదల

**వేదన్యూస్ డెస్క్:**



టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు%ొ% ఢిల్లీలో పెరిగాడు%ొ% ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు. సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. టైటిల్ 'డేవిడ్ రెడ్డి'. ఇది 1897 – 1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా" అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు.

# సంపాదకీయం

చేనేతపై చిన్నచూపు

తెలంగాణ ఉద్యమంలో చేనేత వర్గం కీలకంగా పనిచేసింది. గ్రామీణ జీవన విధానంలో వ్యవసాయరంగం తర్వాత ప్రధానమైన జీవనోపాధిగా చేనేత వెలుగొందుతున్నది. తెలంగాణ అస్తిత్వంలో పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, దుబ్బాక, వరంగల్, కరీంనగర్ చేనేత వస్త్రాలు విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం చేనేత రంగాన్ని ఒక ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తించి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. చేనేత శాఖను కేటీఆర్ సమర్థవంతంగా నిర్వహించి చేనేత మరమగ్గాల రంగాల రెండింటిని అభివృద్ధి పరిచారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు రంగాలను పూర్తిగా విస్మరించి చేనేత కార్మికుల ప్రయోజనాలను కాలరాస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు మించి ఒక పథకం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తదాన్ని తీసుకురాలేదు. చేనేత కార్మికులకు రుణమాఫీ రూ.లక్ష వరకు చేస్తామని చెప్పి నేటికీ అమలుచేయని దుస్థితి. నూలు సబ్సిడీ స్థానంలో చేనేత కార్మిక కుటుంబాలకు ఏటా రూ.24 వేల చొప్పున ఇస్తామని ప్రకటించినప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ పథకం ప్రతిపాదనలు గత ప్రభుత్వంలోనివే. చేనేత కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని మూడేండ్ల కాలవ్యవధి నుంచి రెండేండ్లకు కుదించారు. గత ప్రభుత్వంలో విడుదల చేసిన త్రిఫ్ట్ ఫండ్ పథకంలోని నిధులను తాము విడుదల చేసినట్టుగా చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లింది. చేనేత దినోత్సవ సందర్భంగా నిపుణులైన చేనేత కార్మికులకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో అవార్డులను ప్రవేశపెట్టింది గత కేసీఆర్ ప్రభుత్వం.

పద్మశాలి సమాజం కోసం కోకాపేటలో రెండున్నర ఎకరాలు, ఆత్మగౌరవ భవనం కోసం రూ.5 కోట్లను గత కేసీఆర్ ప్రభుత్వం కేటాయించింది. నేటికీ ఈ భవనం నిర్మాణం మొదలు కాలేదు. శాసనసభ, శాసనమండలిలలో టీఆర్ఎస్ పక్షాన చేనేత వర్గానికి చెందిన వ్యక్తులు ఇద్దరు సభ్యులుగా ఉన్నారు. సామాజిక న్యాయం మాట్లాడే కాంగ్రెస్ పార్టీ పద్మశాలి సమాజానికి ఏ విధమైన ప్రాతినిధ్యం కల్పించలేదు. అవకాశం ఉన్న చేనేత మరమగ్గాల కార్పొరేషన్లకు కనీసం చైర్మన్లను కూడా నియమించలేదు. అట్టహాసంగా పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించి ఏడాది కావస్తున్నా నేటికీ నిధులను కేటాయించలేదు. సరి కదా చైర్మన్ నియామకం కూడా జరగలేదు.

ఇదంతా చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం నోటి మాటలతోనే సానుభూతిని చూపిస్తుంది తప్ప చేనేత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. ఇక ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని, టెస్కోకు పాలక మండలి ఎన్నికలు నిర్వహిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఏమైందో చేనేత మంత్రి చెప్పాలి. ప్రాథమిక చేనేత సహకార సంఘాల నుంచి నేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను కొనుగోలు చేయడంలో టెస్కో పూర్తిగా విఫలమైంది. చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలలో కనీసం 50 శాతం ప్రభుత్వం కొనుగోలు చేసి వారి ఉపాధికి

భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇదిలా ఉంటే సిరిసిల్లను ఉరిసిల్లగా మారుస్తున్నది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. గత ప్రభుత్వం ఆత్మహత్యలకు నిలయమైన సిరిసిల్ల మరమగ్గాల రంగాన్ని పునర్నిర్మించి అభివృద్ధిపరిచేందుకు అనేక పథకాలను అమలుచేసింది. ఆత్మహత్యలు లేని సిరిసిల్లగా తీర్చిదిద్దింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతోమంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు.

బతుకమ్మ చీరలు ఆర్డర్ ఇవ్వడంలో ఆలస్యం చేయడం వల్ల అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరమగ్గాల రంగానికి సబ్సిడీతో కూడిన విద్యుత్తు సరఫరా ఆపివేయడంతో నేడు సిరిసిల్లలో సగానికి పైగా మరమగ్గాలు పనిచేయడంలేదు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రవేశపెట్టి రూ.వందల కోట్ల నిధులతో షెడ్లు నిర్మించింది గత ప్రభుత్వం. ఈ పథకాన్ని అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న ఒకే ఒక కారణంతో సిరిసిల్లలో చేనేత కార్మికుల మీద కక్ష తీర్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నది.

తనను గెలిపించలేదని అక్కడి కాంగ్రెస్ ఇంచార్జ్ మరమగ్గాల రంగం అభివృద్ధి కోసం ఏ ఒక్క పథకం ప్రవేశపెట్టకుండా అడ్డుపడుతున్నారు. నేడు సిరిసిల్లలో ఉపాధి లేక చేనేత కార్మికులు తిరిగి మహారాష్ట్రకు, గుజరాత్‌కు వలసలు పోయే పరిస్థితి దాపురించింది. నిజంగా చేనేత కార్మికుల మీద చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి సిరిసిల్ల నేత కార్మికుల సమస్యల మీద హౌజ్ కమిటీని ఏర్పాటుచేసి పరిష్కరించాలి.

# అందరి లెక్కలు సరి చేస్తాం

అధికారంలోకి వస్తాం.. అందరి లెక్కలు సరి చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. పరిగి నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే కలెక్టర్లు, పోలీసు అధికారులకు ఒక్కటే చెబుతున్నా. పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. ఖైరతాబాద్‌లో మొన్న రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ కలిసి చిలుక పలుకులు మాట్లాడుతున్నారు. కాంగ్రెసోళ్లు మాట్లాడినట్లు మాట్లాడుతున్నారు. ఎక్కువ సమయం లేదు. మరో రెండున్నరేండ్లలో మళ్లీ మేమే వస్తాం. ఎవరైతే ఎగిరెగిరి పడుతున్నారో.. రేవంత్ రెడ్డి కంటే ఎక్స్‌ట్రాలు చేసే వారందరి పేర్లు బరాబర్ రాసి పెట్టుకుంటాం. ప్రతి ఒక్కరి మాటలు యాది పెట్టుకుంటాం. అన్ని లెక్కలు సెటిల్ చేసే బాధ్యత నాది అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

కష్టపడి తెలంగాణ సాధించుకున్నాం. సాధించుకున్న తెలంగాణను అద్భుతంగా తయారు చేసుకుంటూ వచ్చాం. తండాలను పంచాయతీలు చేస్తామని కాంగ్రెసోళ్లు చెప్పిన కాలేదు. కానీ కేసీఆర్ హయాంలో తండాలు పంచాయతీలు అయ్యాయి. కొత్త మండలాలు, జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. ఇవాళ వికారాబాద్‌లో కూడా కలెక్టరేట్ ఏర్పాటు చేసుకున్నాం. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మన కలెక్టరేట్‌లను ప్రశంసించారు. ఇతర రాష్ట్రాల్లోని సెక్రటేరియట్‌లు కూడా తెలంగాణలోని కలెక్టరేట్ల మాదిరి లేవన్నారు. ప్రతి గడప ముందుకు పాలన తీసుకొచ్చారు కేసీఆర్. ప్రతి ఊరిలో రైతు వేదిక, ప్రకృతివనాలు, స్మశానవాటికలు, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకున్నాం. రైతులకు 24 గంటల ఉచితంగా కరెంట్ ఇచ్చారు. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

మనం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించడంలో మనం ఫెయిలయ్యాం. పదేండ్లలో సాధించిన ప్రగతిని చెప్పుకోలేకపోయాం. అవతలోడు వచ్చి ఆశచూపెట్టి గెలిచిండు. గెలిచాక ఏం చేస్తలేడు. కాంగ్రెస్‌ను నమ్మి ఇవాళ బాధపడుతున్నారు. కార్యకర్తల్లాగా మనం చేయాల్సిన పని ఒక్కటే. కేసీఆర్‌కు సీఎం కొత్త పదవి కాదు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో ఈ దుర్మార్గుల ప్రవర్తన వల్ల మళ్లీ 15 ఏండ్లు వెనక్కి పోయే ప్రమాదం ఉంది. అందుకే తెలంగాణను మళ్లీ పట్టాలెక్కించాలంటే కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలి. కార్యకర్తలందరం కలిసి పని చేద్దాం. వికారాబాద్ జిల్లాలో భూముల ధరలు తగ్గాయి. రాష్ట్రంలో ఎక్కడా కూడా ఒక మనిషి సంతోషంగా లేడు. తినే అన్నంలో మన్ను పోసుకున్నట్టు ఉందని రైతులు అంటున్నారు. గిట్టుబాటు ధర లేదు. ఎరువులు, విత్తనాలు దొరకడం లేదు. యూరియా కోసం లైన్లలో చెప్పులు పెట్టి ఎదురు చూసే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# దేశంలో మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ



**వేదన్యూస్ డెస్క్:**

ఈ రోజుల్లో సెల్ ఫోన్ మానవ జీవితంలో భాగమైపోయింది. అది లేకుండా రోజు గడవడమే కష్టంగా మారింది. దానికి తోడుగా ఇయర్ బడ్స్, స్మార్ట్ వాచ్ ఇలా ఇంట్లో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటున్నాయి. వాటికి ఏదైనా సమస్య వస్తే చాలా వరకు రిపేర్ చేయిస్తాం. అప్పటికీ సమస్య తీరకపోతే దాన్ని పారవేస్తాం. దీనివలన దేశంలో రోజురోజుకూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల ముప్పు పెరుగుతోంది. ఏటా వ్యర్థాలు పోగుపడుతుంటే, రీసైక్లింగ్ ప్రాసెస్‌లో సరైన విధానాలు అవలంభించక సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలు వాడి పారేస్తున్న సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడంలో పీసీబీ, మున్సిపల్, ఇతర విభాగాల ఆలసత్వం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. మనం వాడి పడేసిన బ్యాటరీలు జలాశయాలను సైతం కలుషితం చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోంది. మొదటి సారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల తర్వాత దేశంలో మూడో అతిపెద్ద ఈ-వ్యర్థాల ఉత్పత్తిదారుగా రాష్ట్రం నిలిచిందని లోక్‌సభలో పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం నాటికి 1.19 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వెల్లడించింది. ఈ వ్యర్థాలన్నీ ఐటీ రంగానికి కేంద్రంగా ఉన్న రాజధాని నగరం నుంచే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పింది. ఈ-వ్యర్థాల పునర్వినియోగం కోసం కాలుష్య నియంత్రణ మండలి 31 సంస్థలకు అనుమతులిచ్చింది. కాగా అందులో 20కి పైగా సంస్థలు రాజధాని పరిధిలోనే ఉన్నాయి. ఈ సంస్థలకు ప్రతి సంవత్సరం 2.25 లక్షల టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే సామర్థ్యం ఉంది. అయినా 40 వేల మెట్రిక్ టన్నులకు మించి రీసైక్లింగ్ చేయడం లేదు. కాగా పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2023-24లో ఎక్స్‌టెండెంట్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (ఈపీఆర్)లో భాగంగా 63,635 మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో రాగి, ఇనుము, బంగారం, అల్యూమినియం వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులుండగా ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్నులు ఉన్నాయని పేర్కొంది.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి విషపూరిత పదార్థాలుంటాయి. వీటిని రీసైకిల్ చేయకపోతే గాలి, నీరు, నేలని కలుషితం చేస్తాయి. నీటి వనరుల్లో సీసం కలిస్తే కాలుష్యానికి దారి తీయడంతో పాటు నీటిలో ఉండే జీవుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ రసాయనాలు నేలలో చేరి దాని సారాన్ని దెబ్బతీస్తాయి. వీటిని కాల్చడం, అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయడం వల్ల డైఆక్సిన్‌లు, ఫ్యూరాన్లు వంటి విషపూరిత వాయువులు విడుదలై గాలిని కలుషితం చేస్తాయి. దీంతో క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాస కోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీస్తాయు.

## దివీస్ లాభం రూ 545 కోట్లు




**వేదన్యూస్ డెస్క్:**


దివీస్ లాభం రూ.545 కోట్లు వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి దివీస్ లేబరేటరీస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయాయి. ఈ కాలానికి కంపెనీ రూ.2,410 కోట్ల ఆదాయంపై రూ.756 కోట్ల స్థూల లాభం, రూ.545 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 14 శాతం, స్థూల లాభం 16.3 శాతం, నికర లాభం 27 శాతం పెరిగాయి. అయితే మార్కెట్ వర్గాలు ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.2,437 కోట్ల ఆదాయంపై రూ.794.8 కోట్ల స్థూల లాభం, రూ.573.25 కోట్ల వరకు నికర లాభం నమోదు చేస్తుందని అంచనా వేశాయి. జూన్ త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభ శాతం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 0.7 శాతం పెరిగి 31.4 శాతానికి చేరింది.

## స్టార్టప్‌లకు మద్దతుగా 100 కోట్ల నిధి

**వేదన్యూస్ డెస్క్:**

దేశానికి చెందిన అగ్రగామి వెంచర్ స్టూడియో బయోమి రూ.100 పెట్టుబడుల సమీకరణను పూర్తి చేసినట్టు ప్రకటించింది. బయోమి తన సమీకృత వ్యూహం, ప్రతిభ, మూలధన నమూనా ద్వారా ప్రతీ ఏడాది అధిక కట్టుబాటు గల స్టార్ట్‌పలను గుర్తించి మద్దతు అందిస్తుంది. తొలి విడతలో బీవీఆర్ మెహన్ రెడ్డి (సైయెంట్), ప్రసాద్ యెర్నేని (ఎకోరెన్ ఎనర్జీ), అభినవ్ రెడ్డితో పాటు (గర్ కార్పొరేషన్) కొన్ని కుటుంబ గ్రూప్‌లను కూడా ఒక వేదిక పైకి తెచ్చింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 166 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్..!



**వేదన్యూస్ డెస్క్:**

దేశీయ స్టాక్ మార్కెట్‌లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) అంచనాలకు అనుగుణంగా కీలక వడ్డీ రేట్లను యథావిధిగా కొనసాగించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 5.5 శాతం వద్దే ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ ప్రస్తుతం ఉన్న 5.5 శాతం రెపోరేటు కొనసాగుతుందని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం 80,694.98 ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 80,834.43 పాయింట్ల గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,448.82 పాయింట్లకు పడిపోయింది. చివరకు 166.26 పతనమై.. 80,543.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.35 పాయింట్లు తగ్గి 24,574.20 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో విప్రో, సన్ ఫార్మా, జియో ఫైనాన్షియల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా అత్యధికంగా నష్టపోగా.. ఏషియన్ పేయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్ (0.6 శాతం) మినహా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మీడియా, రియాల్టీ, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ ఒకటి నుంచి 2శాతం తగ్గాయి. ఇతర రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073